భయం

శ్రీ కె. యస్. వి. నరసింహం

చిట్టిబాబుకు పుట్టు మతిమరుపు.

ఆ సంగతి తెలీనివాళ్ళు ఆ వూళ్ళోనేకాదు, ఆ చుట్టుపక్కల వూళ్ళలో కూడా లేరు.

కాశేశ్వరరావుగారి నెరిగిన వాళ్ళందరికీ చిట్టిబాబు సంగతి తెలుసు. చిట్టిబాబు మతిమరుపు సంగతీ తెలుసు.

'ఇంతకీ ఈ కాశేశ్వరరావుగా రెవరయ్యా?' అనడుగుతారా?

చంపేశారు.

మీకు కాశేశ్వరరావుగారే తెలీదా? — అయితే మీకు కృష్ణాపురమే తెలీదన్నమాట. కృష్ణాపురం పంచాయితీ సమితిలో కొచ్చే ఆ చుట్టుపక్కల వూళ్ళ గురించి కూడా మీకు తెలీదన్నమాట! ఆ వూళ్ళ లోంచి ఎప్పుడో ఆర్నెల్లకో సంవత్సరానికో ఒకసారైనా మీవద్దకు వచ్చిపోగల పరిచయస్థులుగాని, బంధువర్గంగాని, ఎవ్వరూ లేరన్నమాట! అయితేనేం?— మీకు కాశేశ్వరరావుగారే తెలీదా? చంపేసి పోయారే! బాబ్బాబూ—ఆ సంగతి ఎక్కడా గట్టిగా అనకండి. నన్ను కాబట్టి ఏదో గుట్టుగా అడిగారు గాని, మరెక్కడా ఈ సంగతి గురించి వాకబు చెయ్యకండి.

కాశేశ్వరరావుగా రెవరంటే ఏమని చెప్పను? ఆయన్ని వర్ణించి చెప్పాలంటే నేను నేర్చిన మాటలు చాలవు. ఆయన వంశవృక్షం ఏకరువుపెడితే, వినే ఓపిక మీకు తప్పకుండా ఉంటుందనే చెప్పగలను— కాని, అసలే శక్తిచాలని నా కలం మధ్యలో అలసటతో ఆగిపోకుండా ఉండదని హామీ ఇవ్వలేను. అందుచేత, అలవిగాని పనుల్లో తలదూర్చకుండా, నా ఓపినంతమట్టుకు కాశేశ్వరరావుగారిని మీకు పరిచయం చేస్తాను (—అదీ, ఇలా నేను వారిని 'పరిచయం' చెయ్యడానికి సాహసించానని మీరెక్కడా అనకుండా ఉంటారని బాస చేస్తేనే సుమండీ—)

దగ్గరకెళ్లి కొలిచే తెంపరితనం ఎవ్వరికీ లేదు గాని, ఉంటే— కొలిచి, ఆయన ఛాతీ గజమున్నరని చెప్పవచ్చు. ఆరడుగులో— అంతకుపైన మరో అరడుగో—ఎత్తు. పంచాస్యం అనే మాటకి వ్యుత్పత్తితో అర్థం చెప్పేట్టుండే ముఖం. ఆ ముఖం అంతటిలోకీ, ఆ మాటకొస్తే మనిషి మనిషంతటిలోకీ, కొట్టొచ్చినట్టు కనిపించే బొద్దుమీసాలు. నిప్పుకణికల్లాంటి కళ్ళు. నడిపాపటతో పక్కలకి ఎగదువ్విన తలవెంట్రుకలు. గోచీపోసికట్టిన ఎర్రంచు తెల్లపంచె. పులిచారల పసుపులాంటి రంగులో సిల్కుజుబ్బా. దానిపైన—మడత నలగని సరిగ ఖండువా.— అలా ఉంటారు కాశేశ్వరరావుగారు. ఉంటారు, ఏం చేస్తుంటారు?

తల్లి కడుపులోంచి కాకుండా మరోలా ఎలాగైనా మీరు భూమ్మీదికి రాగలరేమోగాని, కాశేశ్వరరావుగారి భూములు తొక్కకుండా మాత్రం కృష్ణాపురంలోకి రాలేరు. వారి వంశపు వృత్తే వ్యవసాయం. వంశాచారాలను కాశేశ్వరరావుగారు ఎన్నటికీ అతిక్రమించరు. అలాగని ఆయన వ్యవసాయంతో ఆగిపోనూ ఆగిపోలేదు.

కాశేశ్వరరావుగారికి రాజకీయాల పిచ్చి ఉంది. కాని, ఆయన పిచ్చికో పద్ధతి ఉంది. ఆయనకు చదరంగం ఆడడం బాగా వచ్చు; జీవితంలో కూడా. ఆయనకు మంచిపలుకుబడి ఉంది. పలుకుబడిని ఉపయోగించుకునే చాకచక్యం కూడా ఉంది. ఆ సంగతి; ఆయన మొట్టమొదటిసారిగా రాజకీయాల్లో ప్రవే

శించి, రెండు నెలలకల్లా సమితి ప్రెసిడెంటై కూర్చునే సరికే బుజువైంది.

అన్నింటినీమించి, కాశేశ్వరరావుగారిలో ఒక రాజ తీవి ఉంది. ఒక దర్పం ఉంది. ఒక కరుకుదనం ఉంది. ఆయన మాటకు వేటకత్తికున్నంత పదును ఉంది; కమాండర్ జనరల్‌గారి తుపాకీ తూటాకున్న పవరూ ఉంది. ఆయనకు అగ్నిహోత్రంలా ధగధగలాడే పెర్స నాలిటీ ఉంది. ముందుకాలంలో చక్రవర్తులన్నా, రాజు లన్నా జనం ఎలా భయపడేవారో—ఇప్పుడూ కాశే శ్వరరావుగారంటే అలాగే భయపడతారు, ఆ చుట్టు పక్కల చాలామంది. ఆయన అకారణంగా ఎవ్వరికీ అపకారం చెయ్యరు—అని అందరికీ తెలుసు. అయినా యం.

ఆయన పేరు చెబితే చాలు, ఎంతగా మారాం చేసే పిల్లలైనాసరే, టక్కున అల్లరి మానుకుంటారు. ఆయన పేరు వినబడితే, పిట్టలు నీళ్లు తాగవు—తాగ బోయేవి ఆ ప్రయత్నం మానుకుంటాయి-తాగిన పిట్ట లైనా నీళ్లు కక్కేస్తాయి.

—అయ్యా! — వారు, కాశేశ్వరరావుగారు— ఆయన్నిగురించి, ఇహ, ఇక్కడితో ఆపుదాం.

పులుల్ని చూసిన వాళ్లుండొచ్చు. పులి పిల్లల్ని చూసిన వాళ్లుండొచ్చు. కాని, పులి కడుపున పుట్టిన మేకపిల్లని, దానిగురించి వినడమేగాని, ఎవరైనా నిజంగా చూశారా? కాశేశ్వరరావుగారు పులిఅయితే, చిట్టిబాబు మేక.

పుట్టినప్పుడు-మామూలుగా ఉండవలసిన పరి మాణం కన్నా కొంచెం చిన్నగా ఉన్నాడు చిట్టిబాబు. అప్పుడతణ్ణి చూసినవాళ్లందరూ అతణ్ణి చిట్టిబాబు చిట్టిబాబని పిలిచారు. తమ తండ్రిగారైన భుజంగరావు బహద్దరు వారి పేరే కొడుక్కి కూడా పెడదామను కున్నారు కాశేశ్వరరావు గారు. అనుకోవడ మేమిటి?— ఆ నామధేయమే పెట్టారు కూడా. కాని, ఎందు చేతనో ఏమో—చిట్టిబాబుని ఆ పేరుతో ఎవ్వరూ పిలవలేదు. రోజులు గడిచినకొద్దీ అతనికి చిట్టిబాబనే పేరే స్థిరపడిపోయింది. ఈ పద్ధతి నచ్చని కాశేశ్వరరావు గారు, ఇందుకు అడ్డుతగలబొయ్యారుగాని—తరువా త్తరువాత, 'జనవాక్యంతు కర్తవ్యం'—అను కున్నారో ఏమో, తాముకూడా చిట్టిబాబుని చిట్టిబాబనే పిలవ డం ఆరంభించారు.

ఇంతకీ మనం ఎక్కడ ఆరంభించాం?—ఓ— మరిచే పోయాను—

'చిటి బాబుకు పుట్టుమతిమరుపు' దగ్గర— అవును—అక్కడ ఆరంభించాం.

అవునౌను, చిట్టిబాబుకు పుట్టుమతిమరుపు!

పుట్టుగుడ్డి వాళ్ళనీ, పుట్టు చెవిటివాళ్ళనీ, పుట్టు అవిటి వాళ్ళనీ—ఎలాంటి వాళ్ళనైనాసరే— మనం కొంచెం ప్రయత్నంమీద వెంటనే తెలుసుకో గలం. కాని, పుట్టు మతిమరుపువాళ్ళని తెలుసు కోవడం ఎలా? — అసలు, పుట్టు మతిమరుపు వాళ్ళుంటూ ఎవరైనా ఉంటారా?

ఉంటారనడానికి ప్రస్తుతానికి చిట్టిబాబుని మినహాయించి వేరే ఉదాహరణ అవసరం లేదు.

మతిమరుపూ పరధ్యానమూ ఒకటి కావు.

చంటి బిడ్డలందరూ అసలు, పరధ్యానంలో ఉండే వాళ్ళే! కాని, వాళ్ళది మామూలు పరధ్యానం కాదు. 'బొటనవ్రేల ముల్లోకములు చూచి లోలోన— ఆనందపడు నోరులేని యోగి' అని వర్ణించారే— అలా—అది ఒక యౌగికమైన ధ్యానమేకాని, పరధ్యానం ఎంత మాత్రమూ కాదు. నోట్లో బొటనవ్రేలు పెట్టుకుని, ఇంటి పైకప్పుకేసి చూస్తూ, బోసి నవ్వులు చిందిస్తూ ఉన్న చిట్టిబాబును చూసిన వాళ్ళందరూ, అందరి బిడ్డల్లాగే అతడూ పరమాత్మ స్వరూపమే అనుకున్నారు గాని; దేవ దేవుడు చిట్టిబాబు రూపంలోఉన్న తన స్వరూపానికి కొంచెం బలహీన మైన జ్ఞాపకశక్తిని పెట్టాడని ఎవ్వరూ అనుమా నించలేదు. ఇంకా మాటలైనా తిరగని ఆ పిల్లణ్ణి గూర్చి అలా అనుకోవలసిన అవసరమూ, అవకాశమూ కూడా అప్పట్లో కలగలేదు.

అయితే—అసలు సంగతి ఎన్నాళ్ళని దాగుతుంది? బుడిబుడి నడకల(ప్రాయం దాటుతూ దాటుతూ ఉండ గానే చిట్టిబాబు మతిమరుపుతనం మెల్లమెల్లగా బయటపడిపోయింది. ఆడుకునే బొమ్మల్లో ఏదో ఒక దాన్ని ఎక్కడో ఒకచోట వదిలి మరిచిపోయే వాడు. మళ్ళీ దానికోసం ఇల్లంతా తిరుగుతూ వెదుకుతూ ఉండేవాడు. పెద్దలెవరైనా వెతికి అందిస్తే పుచ్చుకుని, వాళ్ళకేసి చూసి కిలకిలా నవ్వేవాడు. అయితే ఆ ధోరణిని చూసి, పిల్లడికి ఇంకా జ్ఞానం పూర్తిగా రాలేదని అనుకున్నారేగాని, దాన్ని మతిమరుపని ఎవ్వరూ అనుమానించలేదు. కాని, ఆ వూళ్ళో స్కూల్లో చేరిన కొద్దిరోజులకే ఆ సంగతి తేట తెల్లమైపోయింది. చదువుల్లోనూ, ఆటపాటల్లోనూ చాలా చురుగ్గా ఉండేవాడేగాని, హఠాత్తుగా ఎప్పుడో ఒకప్పుడు—మతిమరుపుగా ప్రవర్తిస్తుండేవాడు చిట్టిబాబు. టైంటేబిలు చూసికూడా, ఒకరోజు తీసుకు పోవలసిన పుస్తకాలు మరో రోజు తీసుకు పోయేవాడు. ఆటల్లో పడి పుస్తకాల సంగతి మరిచి పోయే వాడు. స్కూలునుంచి ఇంటికి వస్తూ—పెన్సిలో, కలమో, పుస్తకాలో, చెప్పులో—రోజుకు కనీసం ఒకటైనా—స్కూల్లోనే మరిచిపోయి వచ్చేవాడు. కాశేశ్వరరావుగారి యెడల గల భయంవల్ల—మేష్టార్లో, పిల్లలో, బంట్రోతులో—ఆ వస్తువుని మళ్ళీ ఇంటికి తెచ్చి అప్పగించే వారు—'చిన్నయ గారికి మరీ ఇంత మతిమరుపేంటండీ బాబుగారూ!—', అని సాశ్చర్యంగా విన్నవించుకునేవారు.

కాశేశ్వరరావుగారు కూడా చిట్టిబాబుయొక్క ఈ ధోరణిని గమనించక పోలేదు. కాని, విషయాన్ని ఆయన అంతగా పట్టించుకోలేదు. మతిమరుపులేని దెవరికి? మనుషులన్న తరువాత అందరూ అప్పుడు కాకున్నా ఇప్పుడు—ఎప్పుడో ఒకప్పుడు — పప్పులో కాలేసే వాళ్ళే కదా!

అంతే అయితే చిక్కులేదు. కాని,

అందరు మానవుల్లోనూ అంతో ఇంతో ఉండ గల మతిమరుపు చిట్టిబాబులో కొంచెం ఎక్కువగా ఉణ్ణింది. అబ్బాయి గారు పెరిగి పెద్దవారౌతూ వచ్చే సరికి, రోజు రోజుకూ తగ్గడానికి బదులుగా—అది దినదిన ప్రవర్థమానమౌతూ వచ్చింది.

ఒకసారి కొడుకును కూడా తనతో పొలం తీసుకెళ్ళి, ఏదో పనిబడి ఏదో విషయం—ఇంట్లో చెప్పి రారా—అని పంపిస్తే, ఇంటికైతే వచ్చాడుగాని చిట్టిబాబు—తండ్రి చెప్పమన్న విషయ మేమిటో పూర్తిగా మరిచిపోయాడు. ఇంకొన్ని దినాలకు, దగ్గరి మిత్రులు కొందరితో కలిసి పొరుగూరి సంతకు వెళుతూ, ఇంట్లోంచి పాతిక రూపాయలు తీసుకెళ్ళి, సంతలో డబ్బెవరో కొట్టేశారంటూ ఏడుస్తూ తిరిగొచ్చాడు. తీరా చూసుకుంటే—ఆ డబ్బు అసలతను తీసుకునే వెళ్ళలేదు—ఇంట్లోనే ఉంది! ఇంకా కొన్నిరోజులకు—టౌన్ హైస్కూల్‌నుంచి సెలవులకు ఇంటికొస్తూ, రైలు దిగి సంచీతో చక్కా ఇంటికొచ్చి, కొంతసేపటికి కెవ్వున కేక వేశాడు—

హోల్డాలు రైల్లోనే మరిచిపోయాడు! అర్జెంటు పనిమీద వెళుతూ, కవర్లలోపెట్టి పోస్టు చెయ్యమని ఒకసారి తండ్రి రెండుత్తరాలు ఇచ్చివెళ్ళగా వాటిని అర్జెంటుగానే పోస్టుచేశాడు చిట్టిబాబు. ఒకరికి వెళ్ళాల్సిన ఉత్తరం మరొకరికి వెళ్ళిందని పదిహేనురోజుల తర్వాతగానీ తెలిసిరాలేదు!

నిన్న సాయంత్రం చేసినపని, ఇవాళ ప్రొద్దునయేసరికి మరిచిపోయి ఉండేవాడు. ఒకరికి ఏదైనా ఒకవస్తువు ఇస్తే, అంతే, ఇంక ఆ సంగతి మరిచి పోయేవాడు, అవసరం వచ్చినప్పుడు ఆ వస్తువుకోసం ఇల్లంతా వెదికి, ఎక్కడో పోగొట్టుకున్నానని అంగలార్చేవాడు. రెండు మూడు పనులేవైనా చెబితే, తప్పనిసరిగ్గా ఏదో ఒకటి మరిచిపోయేవాడు—ఎలా మరిచిపోయావని అడిగితే—'అప్పటికీ నాకు అనుమానంగానే ఉంది—ఇంకా ఏమిటో చెప్పారు గదా అని, కాని, ఎంతబుర్ర బద్దలు కొట్టుకున్నా ఏమీ జ్ఞాపకం రాలేదు' అనేవాడు.

ఇన్ని సంగతులు మరిచిపోయినా, చదువు విషయంలో మాత్రం మతిమరుపులేదు చిట్టిబాబుకు, క్లాసువెంట క్లాసు ఫస్టున ప్యాసౌతూ కాలేజీ చదువు

పూర్తిచేశాడు. యూనివర్శిటీ మెట్లు కూడా ఎక్కాడు. ఎమ్మేపట్టా పుచ్చుకున్నాడు. 'చదివేదేమో సరదాకి చదివావు—ఇంకేం చేస్తావు? వ్యవసాయం చేస్తావా? ఉద్యోగం చేస్తావా??' అనడిగారు కాశేశ్వరరావు గారు.

కిక్కురుమనలేదు చిట్టిబాబు. తండ్రిముఖం చూస్తేనే గుండెల్లో అదురువస్తుంది. ఆయనమాట వింటే, పిడుగులమోత వింటున్నట్లుంటుంది. అసలే భయస్థుడు చిట్టిబాబు. ఇంక అలాంటి తండ్రి ముందు నిలబడి, నోరువిప్పి మాట్లాడ్డం కూడానా?

కొడుకును వ్యవసాయంలో పెట్టాలనుకున్నారు కాశేశ్వర్రావుగారు. 'కాని, చిట్టిబాబు తల్లి అందుకు ఒప్పుకోలేదు. 'ఇంతచదువూ చదివి వృధా చెయ్యడమెందుకు? ఇప్పుడిప్పుడే వ్యవసాయంలో దిగితే సుఖపడ్డం ఏముంది? బస్తీ చదువులు చదివినవాడు—వాడు వ్యవసాయం మాత్రం ఏం చేస్తాడు?—ఎక్కడైనా ఉద్యోగం దొరుకుతుందేమో చూడండి—' అందావిడ.

కాశేశ్వర్రావు గారిక్కూడా లోపల్లోపల అలాంటి ఉద్దేశ్యమే ఉన్నట్లుంది—వెంటనే ఒప్పుకున్నారు. కొడుక్కి ఉద్యోగం దొరుకుతుందేమోనని ప్రయత్నించారు. కాశేశ్వర్రావుగారు ప్రయత్నించడమూ—దొరక్కపోవడమూనా? దొరికింది. కాని, ఎక్కడ?—హైదరాబాదులో. జీతం కూడా చిట్టిబాబు చదివిన చదువు తాహతుకు తగ్గట్లుగానే వస్తుంది.

'హైదరాబాదులో దొరికింది ఉద్యోగం—వెళతావా?', అనడిగారు కాశేశ్వర్రావుగారు.

చిట్టిబాబు ఏమీ మాట్లాడలేదు. తండ్రి పంపిస్తూంటే హైదరాబాదేమిటి—అండమాన్సయినా సరే...ఎదురుచెప్పే దేముంది?

ఆ రకంగా హైదరాబాదు వెళ్లాడు చిట్టిబాబు.

కాని, అతడటు వెళ్లిన వారం రోజులకల్లా చిట్టిబాబు తల్లికొక అనుమానం పట్టుకుంది. అసలే అది మహానగరం, పైగా కొడుకు మతిమరుపువాడు. ఏ క్షణాన ఏ ఆపదకు గురి అవుతాడో ఏమో—తల్లి మనసు ఆకులా వణికిపోయింది. మరేం ఫర్వాలేదు- అలాంటి భయమేం లేదు—అన్నారు కాశేశ్వర్రావు గారు. తన భయం తనదంది చిట్టిబాబు తలి. కొడుకు క్షేమ సమాచారాలు ఎప్పటికప్పుడు తెలుస్తూ ఉండకపోతే, తను ఒప్పుకోనంది. సరే నన్నారు కాశేశ్వర్రావు గారు. కొడుక్కొక ఉత్తరం రాశారు. పక్షం రోజులకొకసారి తన క్షేమ సమాచారాలు తెలుపుతూ చిట్టిబాబొక ఉత్తరం రాయాలి. ఏమాత్రం ఆలస్యమైనా, కాశేశ్వర్రావుగారే హైదరాబాదు వచ్చేస్తారు!

తండ్రి మాట జవదాటడు చిట్టిబాబు. అలాగే రాస్తానన్నాడు. అలాగే రాస్తూ ఉన్నాడు. పక్షం రోజులకు కాదు- పదమూడో రోజుకల్లా చిట్టిబాబు దగ్గర్నుంచి ఉత్తరం అందుతోంది.

అంతా ఇలా ఉండగా ఒకనాడేమైందయ్యా అంటే......

* * *

'నమస్కారాలండయ్యగారూ!'..., అన్నాడు ఆ వూరి పోస్టుమాస్టరూ పోస్టుమ్యానూ అయిన వెంకటసుబ్బయ్య.

చదువుతూన్న పేపర్లోంచి తల తిప్పకుండా, తలను అలాగే ఊగించి నమస్కారాన్ని అందుకున్నారు కాశేశ్వర్రావుగారు. చదువుతూన్న 'కాలం' పూర్తిగా పూర్తిచేసి, అప్పుడు తల తిప్పారు.

'ఓ—నువ్వా—ఏమొచ్చాయి ఉత్తరాలు?'—

'చి—చిత్తం. చిత్తూరు ఎమ్మెల్యేగారు కాబోలు—జాబు రాశారండీ...అనంతపురంనుంచి ధనంజయరావు గారు కాబోలు—క్షమించాలి...ఈ ఫ్రం అడ్రస్‌లో అక్షరాలు కొంచెం చెదిరిపోయున్నాయి—వారు రాశారండీ—మదరాసు ఎరువుల కంపెనీనుంచి కూడా ఉత్తరం వచ్చిందండీ...పోతే......కార్డొకటి వచ్చిందండీ...అయ్యో నా మతిమండా...మరిచేపొయ్యాను...హైదరాబాదునుంచి జాబొచ్చిందండీ...చిన్నబాబుగారు రాశారు—',

వినయంగా వంగి ఉత్తరాలు ప్బాలుమీద పెట్టాడు వెంకటసుబ్బయ్య.

'ఎలా ఉంది నీ ఉద్యోగం', అన్నారు కాశేశ్వ్రరావుగారు.

'బాగుందండీ.. తమ దయ—'

'సరే—మంచిది—'

'చి—చిత్తం—మరి నే నెళ్ళొస్తానండీ—నమస్తే...'

వెంకటసుబ్బయ్య వెళ్ళిపోయాడు.

వాలు కుర్చీలోంచి చేయి సాచి ఉత్తరాలు అందుకున్నారు కాశేశ్వరరావుగారు. కొడుకు రాసిన జాబుకాక మిగతా జాబులన్నీ ముందు చదివారు. అలా కొడుకు రాసిన ఉత్తరాన్ని మాత్రం చివ్వరికి కేటాయించడానికి కారణం ఏమిటి? కొడుకు ఉత్తరం కాబట్టి—తీరిగ్గా చదువుకో వచ్చుననా? పదిహేను రోజులకోసారి వచ్చే మామూలు ఉత్తరమేగా—అందులో కొత్త ఏముంటుందిలే—అనా? కారణం ఏదైనా కావచ్చు; కాశేశ్వరరావుగారు కొడుకు ఉత్తరాన్ని మాత్రం అన్నింటికన్నా ఆఖరుగా చేతుల్లోకి తీసుకున్నారు.

అది కవరు, దానిమీద ముత్యాల్లాంటి అక్షరాలలో కాశేశ్వరరావుగారి పేరూ, చిరునామా వ్రాసి ఉన్నాయి. ఎడమవేపు దిగువన, కొంచెం చిన్న అక్షరాలలో—చిట్టిబాబు పేరూ విలాసమూ ఉన్నాయి. 'ఫ్రం' అడ్రెస్‌ను మిగతా అడ్రస్‌నుంచి విడదీస్తూ చక్కటి వంపులతో బ్రాకెట్టు ఒకటి వేసి ఉంది. కవరువేపు నిమిషకాలం అలాగే చూశారు కాశేశ్వరరావుగారు. కొడుకు దగ్గర్నుంచి జాబువస్తూనే దానికేసి అలా చూడ్డం ఆయనకు అలవాటు, అందమైన ఆ చేతివ్రాత చూస్తే ఆయన కళ్లలో సన్నని గర్వరేఖ కదలాడుతుంది. గుబురు మీసాల వారగా పదునైన చిరునవ్వు మెరుస్తుంది.

కవరును వెల్తురు కడ్డంగా పెట్టిచూసి, చింపారు కాశేశ్వరరావుగారు. కాగితాన్ని చేతుల్లోకి తీసుకుని మడతలు విప్పారు. కళ్ళను అక్షరాలవెంట నడిపించారు.

ఉలిక్కిపడ్డారు.

నుదుటిమీద ప్రశ్నార్థకంగా ముడతలు పడ్డాయి.

మరోమారు కాగితంకేసి చూశారు. కవరుకేసి చూశారు. రెంటినీ రెండు రెండుసార్లు మార్చి మార్చి చూశారు.

ఆయన కళ్లు కుంచించుకు పోయాయి.

కవరుకేసీ, కాగితంకేసీ ఇంకోసారి చూశారు. మెల్ల—మెల్ల—మెల్ల—మెల్ల—గా ఆయన కుడి కనుబొమ పైకి లేచింది.

ఏదో అర్థమౌతూన్నట్టు ఆయన తల అప్రయత్నంగా చిన్నగా ఊగింది.

ఆయన పెదవులు అనుకోకుండానే అతికఠినమైన వంపు తిరిగాయి.

తొందర తొందరగా కాగితాన్ని చదివారు కాశేశ్వరరావు గారు—

'డియర్ గిరిజా!—

నీ ఉత్తరం నిన్ననే అందింది. జవాబు రాయడానికి ఇప్పటిదాకా తీరిక దొరకలేదు—Excuse me.

నే నిక్కడ ఒంటరిగా ఉన్నాను. ఎప్పుడూ నువ్వే జ్ఞాపకం వస్తున్నావు. కాలేజీ దినాల్లోనే నయం—మనం రోజూ ఒకర్నొకరు చూసుకుంటూ అయినా ఉండేవాళ్లం. మాటలతో వీల్లేనప్పుడు కనీసం చూపులతోనైనా పలకరించుకుంటూ ఉండేవాళ్లం. ఇప్పుడదీ లేదు.

ఎంత మహానగరంలో ఉన్నా అడివిలో ఉన్నట్టుగా ఉంది. ఈ ఉద్యోగం నా పాలిట శాపంలా దాపురించింది. ఏం చెయ్యమంటావు చెప్పు? 'మేఘసందేశం'లో యక్షుడు అనుభవించిన విరహం ఎంత విషాదంగా ఉంటుందో నా కిప్పుడే అర్థమౌతోంది.

మీ వాళ్లు నీకు సమ్మంధాలు చూస్తున్నారని

రాశావు. ఆ సమ్మంధాల నన్నింటినీ కొట్టిపారెయ్యడానికి నువ్వెన్ని అవస్థలు పడుతున్నావో తలుచుకుంటే నాకు చాలా బాధ కలుగుతోంది. మన విషయం మీా అమ్మా నాన్నలతో నువ్వింకా చెప్పలేదా? వీలు చూసుకుని చెప్పగలవేమో ప్రయత్నించు—

నీ విషయం ఇంత చెప్పినా, నా సంగతి కొచ్చేసరికి కథ మొదటికి వస్తుంది. మా నాన్నగారి విషయం నీకు చెప్పానుగా—ఆయన ముక్కోపి. ఆయనతో ఏం మాట్లాడాలన్నా నాకు భయంగా ఉంటుంది—

వెంటనే ఉత్తరం రాయగలవు. నేను జాబు రాయలేదని నువ్వు లేటు చెయ్యకు. నీ దగ్గర్నుంచి జాబు రాకపోతే నాకు పిచ్చెత్తినట్టుగా ఉంటుంది.

నీ,
చిట్టిబాబు.

ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు—ఆ ఉత్తరాన్ని అలా ఎన్నిసార్లు చదివారో తెలీదు—కాశేశ్వరరావుగారి ముఖం ఎర్రగా ఎర్రబడి పోయింది. కళ్లు మరీ పెద్దవై భీకరంగా తయారయ్యాయి. ముఖంలో ఆవేశంతో కూడిన వణుకు ప్రారంభమైంది.

వాలు కుర్చీలోంచి దిగ్గుమని లేచారు కాశేశ్వరరావుగారు. కాగితాన్ని పట్టుకున్న చెయ్యి అప్రయత్నంగా బిగిసింది.

బోనులో పులిలా, నడవలో అటూ ఇటూ తిరుగుతున్నారు కాశేశ్వరరావుగారు.

ఆయనవేసే అడుగు అడుగుకూ నేల బెదిరి అదురుతోంది.

సూర్యుడు నడినెత్తి కొస్తున్నాడు.

కాశేశ్వరరావుగారిలో క్రోధం సలసలమని కాగుతోంది.

ప్రక్కగదిలోకి వెళ్లబోతూ ఇటు వచ్చింది చిట్టిబాబు తల్లి. భర్తవైఖరిచూసి ఆశ్చర్యపోయింది. ఎంతో ప్రమాదకరమైన విషయమైతే తప్ప, అలా పచార్లు చెయ్యడం ఆయనకు అలవాటు లేదు. ఆ సంగతి ఆమెకు బాగా తెలుసు.

ఇప్పుడేం ప్రమాదం జరిగింది?

—ఆమె ఊహకు అందలేదు.

భర్తను అడగడానికి ఆమెకు ధైర్యం చాల్లేదు. నిశ్శబ్దంగా ప్రక్కగదిలోకి వెళ్లబోయింది.

'ఇదిగో—'

ఆయన గొంతువిని ఆమె ఆగిపోయింది.

'చూశావా సుపుత్రుడు చేసిన ఘనకార్యం?—ఉద్యోగం ఎంత చక్కగా వెలగబెడుతున్నాడో—చూడు—' ఉత్తరం భార్య చేతుల్లో పెట్టారు కాశేశ్వరరావుగారు.

ఆశ్చర్యపోతూ ఉత్తరం అందుకుని, మొదటి నుంచి చివరిదాకా చదివింది చిట్టిబాబు తల్లి.

ఆమె ముఖం తెల్లగా పాలిపోయింది. నమ్మకం లేని తనాన్ని సూచిస్తూ ఆమె కళ్లు పెద్దవై పోయాయి. ఆమె కంఠం రుద్ధమైపోయింది—'బాబు—మనబాబు—మనబాబు— ఇది రాశాడా?—ఇంతకీ—ఈ పిల్ల ఎవరు?—అసలీ ఉత్తరం—మీా కెలా వచ్చింది?'

'రావాల్సి ఉండే వచ్చింది—ఆ వెధవ మతిమరుపే ఈ ఉత్తరాన్ని మనకు పంపించింది...వాడికిది అలవాటేగా—మనకు రావాల్సిన ఉత్తరం ఆ పిల్లకు వెళ్ళుంటుంది...ఆ పిల్లకు వెళ్ళాల్సిన ఉత్తరం మన కొచ్చింది. వెధవ—వెధవ—చూశావా, ఏం రాశాడో ఆ పిల్లకు? నేనట—ముక్కోపినట...', కాశేశ్వరరావుగారి ముఖం రౌద్రంగా తయారైంది.

చిట్టిబాబుతల్లి భయపడింది—'అయితే ఇప్పుడు-ఇప్పుడేం చేద్దామంటారు?'—

ఊపిరి బిగించారు కాశేశ్వరరావు గారు. అప్రయత్నంగా ఆయన పళ్లు పటపట లాడాయి.

'ఏం చెయ్యాలా? చేస్తాను—ఆ వెధవని ఇక్కడికి పిలిపించి, ఇదుగో—ఇదే దూలానికి కోదండం వేయిస్తాను—నా కడుపున చెడబుట్టాడు — ఉద్యోగం చెయ్యరా అని పంపుతే ప్రేమకలాపాలు చేస్తాడా—రానీ చెప్తాను—'

'ఏమండీ...'

ఏదో అనుమానం వచ్చినట్టు ఆగారు కాశే శ్వర్రావుగారు. భార్యకేసి హెచ్చరికగా చూసి అన్నారు— 'ఇదుగో—ఇప్పుడే చెబుతున్నాను—వాడిక్కడికి రాగానే—ఈ ఉత్తరం సంగతీ, నే నసలు వాణ్ణిక్కడికి ఎందుకు పిలిపించానో ఆ సంగతీ—ఏమీ చెప్పకు — వాడంతకు వాడే అడిగినాసరే—నాకు తెలీదను—అంతే—'

భర్తమాటంటే రాజాజ్ఞకన్నా ఎక్కువని చిట్టిబాబు తల్లికి తెలుసు, భర్తకేసి బేలగా చూసి, 'అలాగే—', అని, అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది ఆమె.

ఆ మధ్యాహ్నమే చిట్టిబాబు పేర ఒక అర్జంట్ టెలిగ్రాం వెళ్ళింది.

*　　*　　*

బండీ ఆగిన చప్పుడు వినిపించగానే వాకిట్లోకి ఎదురువెళ్ళింది చిట్టిబాబు తల్లి. బండి దిగి వస్తూన్న కొడుకును చూడగానే, 'వచ్చావా నాయనా!—', అంది విప్పారిన ముఖంతో?

'ఏమిటమ్మా—అర్జెంటుగా రమ్మని టెలిగ్రాం ఇచ్చారు?—'

ఆ మాటతో, మౌనంగా లోపలికి నడిచింది తల్లి.

చిట్టిబాబు ఆమె వెంటే నడిచాడు. 'ఏమిటమ్మా మాట్లాడవు — ఇంతకీ, ఏమైందమ్మా ఇక్కడ?...'

నేరుగా వంటింట్లోకి నడిచింది తల్లి. 'అవన్నీ తరువాత మాట్లాడుదాం—ముందు నువ్వెళ్ళి స్నానం చేసిరా—'

'అదేమిటమ్మా—అర్జెంటుగా రమ్మని టెలిగ్రాం ఇచ్చి—'

'ఆ సంగతులన్నీ నన్నడుక్కు — కాస్సేపట్లో మీ నాన్నగారొస్తారు - వారినే అడుగు.

చిట్టిబాబు వంటింటి గుమ్మంలోంచి కదల్లేదు. తల్లి అతడి ముఖంలోకి చూసింది.

అమాయకమైన ముఖం చిట్టిబాబుది. అమాయకమైన కళ్ళు. ప్రయాణపు అలసట తెరవెనుకనుంచి దోబూచు లాడుతూన్న ముఖంలోని కాంతి—అంత ఆశ్చర్యకరమైన పరిస్థితిలో అతనున్నా కూడా, అతని పెదవులమీద, చిన్నపిల్లలు నిద్రలో నవ్వే నవ్వు లాంటి నవ్వు—

'ఏమిటమ్మా—అలా చూస్తావు'...?

'ఏమీ లేదు నాయనా—వెళ్ళు—వెళ్ళి వేగిరం స్నానం చేసిరా—వేడివేడిగా అన్నం తిందువు గాని—'

అన్నం తిని, మేడమీది తనగదిలోకి వెళ్ళిపోయాడు చిట్టిబాబు.

ఎండ కరకరలాడి పోతూండగా ఇంటి కొచ్చారు కాశేశ్వర్రావుగారు—'వాడొచ్చాడా?'

అడుగుతున్నది చిట్టిబాబు గురించేనని తల్లికి తెలుసు. వచ్చాడని చెప్పింది.

భోం చేశాడా?

చేశాడంది.

మౌనంగా భోజనం ముగించి లేచారు కాశేశ్వర్రావుగారు. నడవలో, విక్రమార్క సింహాసనంలా గంభీరంగా ఉన్న వాలుకుర్చీలో కూచున్నారు—'పిలు వాణ్ణిలా—'

వెళ్ళి పిలిచొచ్చింది తల్లి.

'నువ్వెళ్ళవతలికి—'

ఆమె అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

గుమ్మం దగ్గర నిలుచుని ఉన్నాడు చిట్టిబాబు.

'రారా లోపలికి—'

'వచ్చాడు చిట్టిబాబు.

'ఇక్కడ మేమంతా ఉన్నామనుకున్నావా—చచ్చామనుకున్నావా?'

'నాన్నా!!!'—

'నోర్ముయ్! — ఎవరా గిరిజ?' గద్దించారు కాశేశ్వర్రావు గారు.

ఉలిక్కిపడ్డాడు చిట్టిబాబు. ఎర్రటి అతని ముఖం తెల్లగా పాలిపోయింది. భయంతో కళ్లు బెదిరాయి. 'ఎ–ఏమిటి నాన్నా?' అన్నాడు తడబడుతూ.

'గిరిజ ఎవరూ అనడుగుతున్నాను–'

'గిరిజ– గిరిజ ఎవరు నాన్నా?'

'నన్నా అడుగుతావు? గిరి జెవరో తెలీకుండానే గిరిజకు ఈ ఉత్తరం రాశావుట్రా ఫూల్!' రౌద్రంగా అరిచి, కాగితాన్ని చిట్టిబాబుకేసి విసిరారు కాశేశ్వర్రావుగారు.

ఉత్తరంచూసి నిర్ఘాంతపోయాడు చిట్టిబాబు.

'మాట్లాడ వేంరా ఇడియట్'—

'నాన్నా—ఇది—ఇది'

'నా చేతికెలా వచ్చిందా? రావాల్సిండే వచ్చిందిరా రాస్కెల్! కనిపెంచిన వాళ్ల కంట్లో కారం కొట్టి పోదామనుకున్నావు కదూ?—భగవంతుడు లేడూ పైన?—వాడే చేయించాడు నీచేత ఈ పని— మతిమరుపు వెధవా—నీ ఘనతను నీ చేతులారా నువ్వే నాకు తెలియజేశావు—చెప్పు-ఎవరా గిరిజ?'—

తల వంచుకున్నాడు చిట్టిబాబు—'ఎం. ఏ చదివేప్పుడు—'

'నీతో కూడా చదివి అఘోరించిందా?'

'అ—అవును...'

'ఎన్నాళ్లుగా సాగుతోందీ వ్యవహారం?—'

'నాన్నా!...'

'అడిగిందానికి బదులు చెప్పు—'

'అంతకుముందు, కాలేజీలో కూడా—'

'పూసుకుతిరిగేవాళ్లన్న మాట —ఇద్దరూ కూడబలుక్కునే ఎమ్మేలో చేరారన్న మాట — ఏ ఊరు వాళ్లది?'

'విజయవాడ—దగ్గర—'

'వాళ్ల నాన్నెవడు?—'

'తెలీదు—'

'పోనీ—ఏం చేస్తుంటాడు?

'తెలీదు—'

'ఆస్తిపాస్తు లున్నాయా?'

'తెలీదు—'

'వాళ్ల కుల మేమిటి?'

'తెలీదు—'

'ఆ పిల్ల చెప్పలేదా?'

'అవన్నీ నేను—అడుగలేదు—'

'ఇంకేం అడిగావు?—'నన్ను ప్రేమిస్తావా?', అనడిగావా? అది ప్రేమిస్తానందా? ఇద్దరూ ఇలా బరితెగించి ప్రేమలేఖలు రాసుకుంటున్నారా? స్కాండ్రల్— స్కాండ్రల్—నిన్నూ ఆ పిల్లనూ నిలబెట్టి గుండెట్టి పేల్చేస్తాను — అసలిదంతా ఆ పిల్లవల్ల జరిగింది. ఎర్రగా బుర్రగా ఉన్నాడూ, తండ్రికి ఒక్కగా నొక్క కొడుకూ, వెనకాల కొండంత ఆస్తీ—అని తెలివిగా నీ చుట్టూ వలవేసింది—'

'ఆమె—అట్లాంటిది—కాదు నాన్నా—'

'షటప్—నిన్నగాక మొన్న కళ్లు తెరిచిన గుడ్డువి—ఆడపిల్ల లెల్లాంటివాళ్లో నువ్వు నాకు చెబుతావుట్రా— అదేం కుదరదు—ఒరే — నేనిదే చెబుతున్నాను—ఆ పిల్ల సావాసం ఇంతటితో మానెయ్యి— ఆ పిల్ల సంగతే మరిచిపో—'

'క్షమించండి—నాన్నా — నాకది చేతగాదు—', తలవంచుకునే చెప్పాడు చిట్టిబాబు.

'ఏమిటీ!–', గుడ్లురిమారు కాశేశ్వర్రావుగారు.

'అవున్నాన్నా—నేను— ఆమెను— మరిచిపోలేను'

'ఏమిట్రా నువ్వనేది? — బుద్ధున్నమాటే మాట్లాడుతున్నావా?— బాగా ఆలోచించే మాట్లాడుతున్నావా? నువ్విప్పుడు మాట్లాడుతున్నది ఎవరితోనో తెలిసే మాట్లాడుతున్నావా?—నేనే గనక ఒకసారి ఒకమాట అన్నానంటే—అంతే—హరిహర బ్రహ్మాదులైనా మార్చలేరు—నువ్వాపిల్లను మరిచిపోవాలి—

మరిచి పోయి తీరాలి — లేకుంటే — లేకుంటే నేనేం చేస్తానో తెలుసా?'—

తలవంచి నేలచూపులు చూస్తూనే ఉన్నాడు చిట్టిబాబు—'ఇంట్లోంచి వెళగొడతారు. మీ ఆస్తిలోంచి చిల్లిగవ్వకూడా నాకు రాకుండా చేస్తారు—అంతే గా?'—

నడవనడవంతా నవ్వుతో దద్దరిల్లిపోయింది.

హఠాత్తుగా నవ్విన నవ్వు, ఇంకా నవ్వుతూనే ఉన్నారు కాశేశ్వరరావుగారు—

నివ్వెరపోయి తలెత్తాడు చిట్టిబాబు.

చిట్టిబాబు కళ్లలోకి చూశారు కాశేశ్వరరావుగారు—

తికమక పడిపోయాడు చిట్టిబాబు.

నవ్వు ఆపి అన్నారు కాశేశ్వరరావుగారు —

'అలా చెయ్యనా ఫూల్ — మర్యాదగా నువ్వు ఆ పిల్లను మరిచిపోకపోతే—ఏం చేస్తానో తెలుసా?—ఏం చేస్తానంటే—వెర్రి నాగన్నా—నువ్వాపిల్లను మరిచిపోకపోతే- ఆ పిల్లతోనే నీ పెళ్లి జరిపిస్తాను!!'-

'నాన్నా!', అన్నాడు చిట్టిబాబు, తన చెవులను తానే నమ్మలేనట్లు.

ఇంకా నవ్వుతూన్నారు కాశేశ్వరరావుగారు. నవ్వు ఆపి అన్నారు—'కాశేశ్వరరావు మాటంటేమాటే—నాకు తెలీకుండా ఆ పిల్లను ప్రేమించిన నేరానికి, ఆ పిల్లనే ఇచ్చి నీకు పెళ్లి చెయ్యడమే సరైన శిక్ష—ఏమే—విన్నావా?'

భార్య ఇంతసేపూ తలుపు చాటున ఉందని కాశేశ్వరరావుగారికి తెలుసు. ఆమె ఇవతలికి వచ్చింది. వచ్చి, కొడుకు తలమీద చెయ్యివేస్తూ, నవ్వింది.

'అమ్మా—నేను 'మరి—విజయవాడవెళ్లి—', అన్నాడు చిట్టిబాబు మెల్లిగా—

ఆ మాట కాశేశ్వరరావుగారికి వినపడింది — 'ఏమన్నాడే వీడు—చేసిన ఘనకార్యం చాలదూ—సిగ్గులేక ఇంకా ఆడపిల్లవాళ్లింటిమీద పడతాడా?—ఆట్టే మాట్లాడితే గుండెట్టి పేల్చేస్తాను—ఆ పిల్ల తండ్రిగారి అడ్రసిలా ఇవ్వమను—'

* *

అయ్యో! ఆ తరువాత జరిగిన కథ చెప్పవలసిన అవసరం కూడా ఆట్టే లేదు.

కాశేశ్వరరావుగా రిచ్చిన తీగటపా చూసుకుని రెక్కలు గట్టుకునొచ్చి వాలాడు విజయవాడనుంచి గిరిజ తండ్రి. మూడే ముక్కల్లో వ్యవహారం ఫైనల్ అయిపోయింది. పెళ్లి ఖర్చులు యావత్తూ కాశేశ్వరరావుగారే భరించి వారి స్వగ్రామంలోనే స్వగృహంలోనే పెళ్లి జరిపించ నిశ్చయించి నారు. పెళ్లికి సుముహూర్తం కూడా నిశ్చయించడం జరిగిపోయింది.

కాశేశ్వరరావుగారింటి పెళ్లంటే మాటలా?

దేశం నలుమూలలకీ—మీగడతో చేసినట్టున్న కాగితంమీద, బంగారపు అక్షరాలతో, పసుపురాసిన కొసలతో, పెళ్లి పిలుపులు వయ్యారంగా వెళ్లాయి. పెళ్లి ఏర్పాట్లకోసం ఎలా లేదన్నా ఎంత కాదన్నా నూరు—నూటయాభై మంది నెలరోజులపాటు అహోరాత్రాలూ శ్రమించారు. కృష్ణాపురం అంతా పందిళ్ల ఊరైపోయింది. ఊళ్లో చిన్నా పెద్దా అంతా కలిసి తలో చెయ్యీ వేశారు. కాశేశ్వరరావుగారింటి పెళ్లంటే—ఊరంతటి శుభకార్యమే — ఊరంతటికీ వేడుకే అయింది.

పట్నంనుంచి నాటకాలవాళ్లు వచ్చారు. మ్యాజిక్ షోలవాళ్లు వచ్చారు.

కూచిపూడినుంచి, నాజూకుల దొరసానులైన నట్టువకత్తెలూ వచ్చారు.

విపులమైన నెన్నుదుటిమీద విభూతికట్లు దాల్చి తంజావూరునుంచి మహానాదస్వర విద్వాంసులు వచ్చారు.

వైణికులు, వైణవికులు — అహో ఒక్కరేమిటి- సకలసంగీతసాగరం సమ్మోహనకరంగా తర్లి వచ్చింది.

పెళ్లి మూడురోజులైతే, పెళ్లివేడుకలు పదిహేను రోజులు జరిగాయి.

ఆ అన్నిదినాలూ కృష్ణాపురంలో వేరే పొయ్యి రాజుకోనవసరం లేకపోయింది — భోజనాలు, అల్పాహారాలు, మృష్టాన్నాలు, పిండివంటలు, పాయసాలు, చిత్రాన్నాలు, మైసూరీ వంటకాలు— ఓహో — ఒకటేమిటి—మహావైభవంగా వడ్డించారు. పెళ్లిభోజనం ఆరగించనివాడు దురదృష్టవంతుడు, ఆరగించి గ్రురున త్రేన్చనివాడు పాపాత్ముడు.

ఇక పెళ్లిపందిళ్లు, మంటపాలు, ఊరేగింపులు - ఆ మాట చెప్పేదేముంది?

ఏ వంక జూచినా పువ్వులు—ఏ చాయ జూచినా సుగంధాలు—

పందిరి గుంజలకు కట్టిన పచ్చికొబ్బరి మట్టల వింత వాసనలతో గాలిగాలంతా పరిమళించి పోయింది.

ఇంక ఆ పెళ్లికూతురూ—ఆ పెళ్లికొడుకూ—

మధుపర్కాలతో వాళ్లను చూసేందుకు రెండు కళు కావుకదా—రెండు రెండువందల కన్నులైనా చాలవు......

ఆహా—వధూవరులంటే వాళు —ఈడూ జోడూ అంటే అదీ—

పెళ్లి వేడుకలు జరిగినన్ని దినాలూ కృష్ణాపురం స్వర్గంలో ఒక భాగంగా వెలిగిపోయింది.

ఏ నోటవిన్నా ఆ పెళ్ళి ముచ్చటే!—ఏ మాట విన్నా ఆ పెళ్లి గురించి అచ్చటే!!—

ఇటువంటి పెళ్లి అటు మూడు తరాల దాకా ఎన్నడూ ఈ గడ్డమీద జరగలేదన్నారు.

ఇలాంటి పెళ్లి ఇటుమూడు తరాల దాకా ఇక జరగదు కాక జరగదన్నారు.

పెళ్లి వైభవాన్నంతా సగర్వంగా చూస్తూ, తీవిగా మీసం మీద చేయివేసి దువ్వుకున్నారు కాశేశ్వరరావుగారు.

పెళ్లి తర్వాత మూడు నిద్రలూ అయాక. భార్యతో హైదరాబాదువెళ్లి కొత్త కాపురంపెట్టాడు చిట్టిబాబు. అటు తర్వాత మూడు రోజులకే కొడుకు దగ్గర్నుంచి ఒక ఉత్తరం అందుకున్నారు కాశేశ్వరరావుగారు.

'పూజనీయులైన తండ్రిగారికి—

తమ ప్రియపుత్రుడు అనేకానేక నమస్కారములుచేసి చాయంగల విన్నపములు—

నేనున్నూ మీ కోడలు చి॥ సౌ॥ గిరిజయున్నూ క్షేమముగా హైదరాబాదు చేరినాము. క్రొత్తఇంటిలో మాకు ఏ ఇబ్బందులున్నూ లేవు. అంతా సౌకర్యంగా ఉన్నది..

....

నా మతిమరుపే మీకు నా ప్రేమ రహస్యాన్ని వెల్లడి చేసింది. కాని, మీరు క్షమిస్తారంటే, ఒక్క సంగతి మనవి చెయ్యడానికి సాహసిస్తాను—ఆ వేళ చి॥ సౌ॥ గిరిజకు నేను వ్రాసిన జాబు—మీకు చేరడంలో... నా మతిమరుపు ఏమీలేదు...అప్పుడు దాన్ని నేను కావాలనే మరిచిపోయినాను...'